భారత రాజ్యాంగం.. మౌలికాంశాలు

ప్రజా జీవితాన్ని క్రమబద్ధం చేయడానికి ఉద్దేశించిందే రాజకీయ వ్యవస్థ. ప్రాచీన కాలంలో ముఖ్యంగా గ్రీకు పట్టణ రాజ్యాలు.. పాలకులకు, పాలితులకు మధ్య సంబంధాలను నిర్దేశించడానికి రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాయని చరిత్ర చెబుతోంది. ఇక ఆధునిక కాలంలో అన్ని రాజ్యాలు రాజ్యాంగాన్ని కలిగున్నాయి. ఆధునిక కాలంలో భారతదేశాన్ని చివరిగా పరిపాలించిన బ్రిటిషర్లు 1946లో రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ పరిషత్ మంత్రిత్రయ ప్రతిపాదనల మేరకు ఏర్పాటైంది. నిర్దేశిత సభ్యులు 389 మంది కాగా, వారిని ఎంపిక చేసిన విధానం ఇలా ఉంది..

- **292 మందిని వివిధ రాష్ట్రాల విధాన సభలు ఎన్నుకున్నాయి.**
- **93 మంది స్వదేశీ సంస్థానాలకు ప్రాతినిథ్యం వహించారు**
- **నలుగురు చీఫ్ కమిషనర్‌లు రాష్ట్రాలకు ప్రాతినిథ్యమిచ్చారు.**

అయితే ముస్లింలీగ్ తరపున ఎన్నికైన ప్రతినిధులు డిసెంబర్ 9, 1946న జరిగిన పరిషత్ ప్రథమ సమావేశాన్ని బహిష్కరించారు. మౌంట్ బాటన్ (జూన్3, 1947) ప్రణాళిక మేరకు పాకిస్థాన్‌కు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది. దీంతో భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య 299కి తగ్గింది. పరోక్షంగా ఎన్నుకున్న రాజ్యాంగ పరిషత్ సభ్యులు.. ఒక్కొక్కరు 10 లక్షల మంది జనాభాకు ప్రాతినిథ్యం వహించారు. ప్రథమ సమావేశానికి సచ్చిదానంద సిన్హా తాత్కాలిక అధ్యక్షునిగా వ్యవహరించగా, 1946 డిసెంబరు 11న డా.రాజేంద్ర ప్రసాద్ శాశ్వత అధ్యక్షునిగా ఎంపికయ్యారు.

రాజ్యం ఆశయాలను ప్రతిబింబించేదే రాజ్యాంగం. భారత రాజ్యాంగ రూపకల్పనలో ప్రముఖపాత్ర వహించిన జవహర్‌లాల్ నెహ్రూ.. 1946 డిసెంబరు 13న పరిషత్ సమావేశంలో 'లక్ష్యాల తీర్మానాన్ని' ప్రవేశపెట్టారు. దీనిని 1947 జనవరి 22న రాజ్యాంగ పరిషత్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తీర్మానమే మన రాజ్యాంగ పీఠిక. రెండు సంవత్సరాల 11 నెలల 17 రోజులపాటు కొనసాగిన ఈ రాజ్యాంగ పరిషత్ మొత్తం 11 సమావేశాలు నిర్వహించింది. 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి సమావేశమైన రాజ్యాంగ పరిషత్ స్వతంత్ర్య భారతదేశానికి పార్లమెంట్ బాధ్యతలను కూడా స్వీకరించింది. రాజ్యాంగ రూపకల్పనకు పరిషత్ సభ్యులతో కూడిన అనేక కమిటీలు కృషి చేశాయి. వాటిలో ముఖ్యమైంది రచనా కమిటీ. ఇది ఆగస్టు 26, 1947న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పాటైంది. దీంతో పాటు నిబంధనల కమిటీ, స్టీరింగ్ కమిటీ, రాష్ట్రాలకు సంబంధించిన కమిటీ, కేంద్రప్రభుత్వ అధికారాల కమిటీ, ప్రాథమిక హక్కుల ఉప కమిటీ, అల్పసంఖ్యాక వర్గాల ఉపకమిటీ మొదలైనవి ఇతర ముఖ్యక మిటీలు. బి.ఎన్.రావ్ రాజ్యాంగ సలహాదారునిగా, ఎస్.ఎన్. ముఖర్జీ ప్రధాన లేఖకునిగా విశిష్ట సేవలందించారు. 1949 నవంబరు 26న రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది. 1950 జనవరి 24న రాజ్యాంగం అసలు ప్రతిపై సభ్యులు (284 మంది) సంతకం చేశారు. అదే సంవత్సరం జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ప్రతి సంవత్సరం ఆ తేదీనే రిపబ్లిక్‌డేగా జరుపుకుంటున్నాం.

ప్రజస్వామ్య వ్యవస్థలో ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించేది రాజ్యాంగం. ఇది దేశానికి అత్యున్నత శాసనం. దీనిలోని నిబంధనలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాన్ని నియంత్రిస్తూ.. రాజ్య లక్ష్యాలు నెరవేర్చే ప్రభుత్వ (శాసన, కార్య, న్యాయశాఖలు) నిర్మాణాన్ని, అధికారాలను, బాధ్యతలను వివరిస్తుంది. మన రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు మన నాయకులు వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి... మన దేశ భూత, భవిష్యత్, వర్తమాన కాలలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. 395 నిబంధనలు, 8 షెడ్యూళ్ల కలిగిన ఈ అత్యున్నత న్యాయశాసనం గత 60 సంవత్సరాల్లో అనేక మార్పులకు గురైంది. ప్రస్తుతం 440కు పైగా ప్రకరణలు, 12 షెడ్యూళ్ల కలిగిన అతి పెద్దదైన లిఖిత రాజ్యాంగంగా ఉంది. ప్రకరణ నిబంధనల సంపుటి. కాగా, షెడ్యూళ్లు వాటి వివరణ. అయితే అన్ని ప్రకరణలకు షెడ్యూళ్లు లేవు.

భారతదేశం భౌగోళికంగా, సాంస్కృతికంగా ప్రాచీనమైనప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థగా అధునాతనమైంది. మన రాజ్యాంగ నిర్మాతలు సమకాలీన రాజ్యాల రాజ్యాంగ లక్షణాలకు ప్రభావితులై వాటిలో కొన్నిటిని మన రాజ్యాంగంలో పొందుపరిచారు. ప్రధానంగా మన రాజ్యాంగాన్ని బ్రిటిష్, అమెరికా రాజ్యాంగాలు ప్రభావితం చేశాయి. 'భారత రాజ్యాంగం 1935 భారత ప్రభుత్వ చట్టానికి నకలు' అనే విమర్శ అతిశయోక్తిగా కనిపించినా.. ఆ విమర్శలోనూ కొంత వాస్తవం లేకపోలేదు. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం, అర్ధ సమాఖ్య కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన మొదలైన వాటిని ఈ చట్టం నుంచి తీసుకున్నారు. 150 ఏళ్ల పరిపాలించిన బ్రిటిష్ ప్రభావం మన రాజ్యాంగంపై స్పష్టంగా కనిపిస్తుంది. రిపబ్లికన్ వ్యవస్థ, ప్రాథమిక హక్కులు, స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన న్యాయవ్యవస్థ తదితర అంశాలు అమెరికన్ రాజ్యాంగ ప్రభావాన్ని తెలియజేస్తాయి. ఐరిష్ రాజ్యాంగ ప్రభావాన్ని ఆదేశ సూత్రాలు.. అవశేషాధికారాలు కేంద్రానికి చెందడం కెనడియన్ రాజ్యాంగ ప్రభావాన్ని తెలియజేస్తాయి. అత్యవసర అధికారాల్ని.. జర్మనీ వైమార్ రాజ్యాంగం నుంచి, రాజ్యాంగ సవరణ విధానాన్ని అప్పటి దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. ఏడో షెడ్యూల్‌లో పొందుపరిచిన ఉమ్మడి జాబితా భావన ఆస్ట్రేలియన్ రాజ్యాంగ ప్రభావం. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన ప్రాథమిక విధులు భావనను సోవియట్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. అంత మాత్రాన భారత రాజ్యాంగంలో స్వతఃసిద్ధ భావాలు లేవని కాదు. ఏకీకృత న్యాయ వ్యవస్థ, ప్రభుత్వ సర్వీసుల గురించి రాజ్యాంగంలో ప్రస్తావన, ఎన్నికల సంఘం, ఆర్థిక సంఘం, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లాంటి సంస్థలకు రాజ్యాంగ పరిరక్షణ., షెడ్యూల్డ్ తెగలకు, షెడ్యూల్డ్ కులాలకు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజలకు రాజ్యాంగపరమైన హామీలు మొదలైన అంశాలు మన రాజ్యాంగ

మౌలికతను తెలుపుతాయి.

సవరణ విషయంలో భారత రాజ్యాంగం సరళ, ద్రుఢ సమ్మేళనం. న్యూజిలాండ్ రాజ్యాంగమంత సరళం కాదు. అమెరికా రాజ్యాంగ మంత ద్రుఢమైంది కాదు. భారత భూభాగంలో దాదాపు అన్ని ప్రధాన మతాల వారు నివసిస్తున్నారు. అలాగే భారతదేశం అనేక సంస్కృతుల కలయిక. దీనిని దృష్టిలో పెట్టుకొని మన రాజ్యాంగ నిర్మాతలు లౌకిక స్వభావం కలిగిన రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యం ఒకవైపు మత స్వాతంత్ర్యాన్నిస్తూనే, ఇంకోవైపు మత విషయాల్లో తటస్థంగా వ్యవహరిస్తుంది. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని భారత రాజ్యాంగ లక్షణాలుగా ఈ కింది వాటిని పేర్కొనవచ్చు.

- **అతిపెద్ద లిఖిత రాజ్యాంగం** • **ద్రుఢ,అద్రుఢ సమ్మేళనం**
- **లౌకిక స్వభావం కలది** • **పార్లమెంటరీ తరహా ప్రభుత్వం**
- **రిపబ్లికన్ వ్యవస్థ** • **అర్ధ సమాఖ్య**
- **స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ఏకీకృత న్యాయవ్యవస్థ**
- **స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగపరమైన హోదా**
- **ఏక పౌరసత్వం** • **ప్రాథమిక హక్కులు** • **ఆదేశ సూత్రాలు**
- **స్వాధీనత కలిగిన ఎన్నికల సంఘం, ఆర్థిక సంఘం, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వంటి వ్యవస్థలు**

రాజ్యాంగ పీఠిక:

రాజ్యాంగానికి ఇది తలమానికం వంటిది. రాజ్యాంగం మౌలిక విలువలను దీనిలో ప్రస్తావించారు. సార్వభౌమాధి కారత్వం, సామ్యవాదం, లౌకిక స్వభావం, ప్రజాస్వామ్యం, రిపబ్లికన్ వ్యవస్థ, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, జాతి సమగ్రత, వ్యక్తి మాన్యత (Dignity) మొదలైనవి మన రాజ్యాంగం ప్రాథమిక విలువలు. పీఠిక ప్రధానంగా రాజకీయ స్వభావాన్ని, రాజ్యం లక్ష్యాలను తెలియజేస్తుంది. సామ్యవాదం, లౌకికత్వం, ప్రజాస్వామ్యం, రిపబ్లికన్ వ్యవస్థ రాజకీయ స్వభావాన్ని తెలియజేస్తే.. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం దేశ సమగ్రత మొదలైనవి రాజ్యం లక్ష్యాలను తెలుపుతాయి. ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశ సూత్రాలను పీఠికలో ప్రముఖంగా ప్రస్తావించారు. పీఠిక రాజ్యాంగంలో అంతర్భాగం. అయితే సుప్రీంకోర్టు ఆయా సందర్భాల్లో ఇచ్చిన తీర్పుల్లో చేసిన వ్యాఖ్యానాలు కొంత సందిగ్ధతకు దారితీశాయి. బెరుబరి కేసు(1960)లో పీఠిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని అభిప్రాయ పడితే.. కేశవానందభారతి కేసు (1973), మినర్వా మిల్స్ కేసు(1980) లో పీఠిక రాజ్యాంగంలో అంతర్భాగమేనని వ్యాఖ్యానించింది.

నమూనా ప్రశ్నలు

1. భారత రాజకీయ వ్యవస్థను సహకార సమాఖ్యగా వర్ణించిందెవరు?
   ఎ) కె.సి. వేర్ బి) సర్ ఐవర్ జెన్నింగ్స్
   సి) ఎ.సి.బెనర్జీ డి) గ్రాన్‌విల్ ఆస్టిన్
2. రాజ్యాంగంలోని ఎన్నో షెడ్యూల్ కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజనను వివరిస్తుంది?
   ఎ) నాలుగో బి) ఒకటో
   సి) ఏడో షెడ్యూల్ డి) ఎనిమిదో
3. అవశిష్ట అధికారాలు దేనికి సంబంధించినవి?
   ఎ) కేంద్రం బి) రాష్ట్రాలు
   సి) కేంద్రం, రాష్ట్రాలు డి) రాష్ట్రపతి
4. భారత సమాఖ్యకు, అమెరికా సమాఖ్యకు గల ఉమ్మడి లక్షణమేది?
   ఎ) ఏక పౌరసత్వం బి) కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు
   సి) ద్వంద్వ న్యాయ వ్యవస్థ
   డి) న్యాయ సమీక్షాధికారం
5. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
   ఎ) రాజ్యాంగం బి) ప్రజలు
   సి) పార్లమెంట్ డి) రాష్ట్రపతి
6. రాజ్యాంగ పరిషత్‌లో కేంద్ర రాజ్యాంగ కమిటీ చైర్మన్‌గా ఎవరు వ్యవహరించారు?
   ఎ) బి.ఆర్. అంబేద్కర్ బి) జె.బి. కృపలాని
   సి) జవహర్‌లాల్ నెహ్రూ డి) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
7. రాజ్యాంగ పరిషత్ ప్రధాన న్యాయ సలహాదారుడు?
   ఎ) డాక్టర్ కె.ఎం. మున్షి బి) బి. నర్సింగరావు
   సి) టి.టి. కృష్ణమాచారి డి) సర్దార్ వల్లభాయ్ పటేల్
8. ఏ దేశ రాజ్యాంగం రాష్ట్రపతి ఎన్నికకు మార్గదర్శకం?
   ఎ) ఐర్లాండ్ బి) స్పెయిన్
   సి) అమెరికా డి) ఆస్ట్రేలియా
9. రాజ్యాంగ పీఠికను ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సవరించారు?
   ఎ) 36 బి) 44 సి) 42 డి) 56
10. తొమ్మిదో షెడ్యూల్‌ను ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు?
    ఎ) మొదటి బి) రెండు
    సి) తొమ్మిది డి) పదకొండు
11. రాజ్యాంగంలోని ఎన్నో షెడ్యూల్లో రాష్ట్రాల పేర్లు, వాటి భూభాగాలు వివరించారు?
    ఎ) మొదటి బి) రెండు
    సి) మూడు డి) నాలుగు
12. జనవరి 26, 1950ని రిపబ్లిక్ డేగా పాటించడంలో ప్రత్యేకత ఏమిటి?
    ఎ) ఆ తేదీ నాటికి రాజ్యాంగం తయారు కావడం
    బి) ఆ తేదీని పవిత్ర దినంగా భావించడం
    సి) 1930 నుంచి జనవరి 26ని స్వాతంత్ర్యదినంగా కాంగ్రెస్ పార్టీ పాటిస్తుండటం
    డి) ఏదీ కాదు
13. పౌరసత్వానికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు ఎప్పటినుంచి అమల్లోకి వచ్చాయి?
    ఎ) ఆగస్టు15, 1947 బి) నవంబరు 26, 1949

సి) జనవరి 26, 1950 డి) డిసెంబరు 9, 1946

14.భారత రాజ్యాంగ పీఠిక ముఖ్యలక్షణాలు?

ఎ)సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయ రంగాల్లో సమాన హోదా

బి)ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ఆరాధన విషయాల్లో స్వేచ్ఛ

సి)వ్యక్తి గౌరవాన్ని, ఐక్యతను, సమగ్రతను పెంపొందించే సౌభ్రాతృత్వం

డి) పైవన్నీ

15.పీఠికలో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చిన భావాలు?

ఎ) సామ్యవాద, లౌకిక బి) ప్రజాస్వామ్య, రిపబ్లిక్

సి) సామ్యవాద, లౌకిక, ఐక్యత, జాతి సమగ్రత

డి) ఐక్యత, జాతి సమగ్రత

16.ప్రాథమిక విధుల్ని రాజ్యాంగంలోని ఎన్నో ప్రకరణలో పొందుపరిచారు?

ఎ) 50 బి) 51 సి) 51ఎ డి) 52

17.భారత రాజ్యాంగాన్ని ఎన్ని భాగాలుగా విభజించారు?

ఎ) 22 బి) 21 సి) 20 డి) 19

18.రాజ్యాంగ పరిషత్ ఎప్పటినుంచి తాత్కాలిక పార్లమెంట్‌గా వ్యవహరించింది?

ఎ) జనవరి 26, 1950 బి) జనవరి 24, 1950

సి) నవంబరు 26, 1949 డి) ఆగస్టు 15, 1947

19.వివిధ రంగాల్లో నిష్ణాతులను రాజ్యసభకు నియమించే సంప్రదాయాన్ని ఏ రాజ్యాంగం నుంచి గ్రహించారు?

ఎ) దక్షిణాఫ్రికా బి) ఐరిష్

సి) ఆస్ట్రేలియా డి) బ్రిటన్

20.అధికారభాషకు సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు?

ఎ) 330 – 342 బి) 343 – 351

సి) 352 – 360 డి) 361 – 367

సమాధానాలు

1	డి	2	సి	3	ఎ	4	డి
5	బి	6	సి	7	బి	8	బి
9	సి	10	ఎ	11	ఎ	12	సి
13	బి	14	డి	15	సి	16	సి
17	ఎ	18	ఎ	19	బి	20	బి